క్లుప్తంగా...

రేపు సాయి సంస్థాన్ వార్షికోత్సవం

మణికొండ: నార్సింగి గ్రామంలోని సాయిసంస్థాన్ 16వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామని కమిటీ నాయకులు తెలిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం, సాయంత్రం సాయిబాబా పల్లకీ సేవలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

28న సీబీఐటీలో వ్యవసాయ సాంకేతిక ప్రదర్శన

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఈ నెల 28వ తేదీన ఏసీఐసీ–సీబీఐటీ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాల ప్రదర్శన జరుగుతుందని విభాగాధిపతి ఎ. విజయ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ ఔత్సాహికులు పాల్గొంటారన్నారు. ఆధుకంగా వ్యవసాయాన్ని అగ్రగామిగా మార్చడానికి ఈ మేళా ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ యంత్రీకరణ నుంచి ఆరోగ్య సాంకేతికత, పర్యావరణానికి సుస్థిరత, సాంకేతికత మొదలైన 50కి పైనా ఇన్నోవేషన్ వినూత్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీలో మంచినీటి సరఫరా లోప్రెషర్‌తో వస్తున్నందున తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు మంగళవారం సర్కిల్ జలమండలి జీఎంకు ఫిర్యాదు చేశారు. గడచిన 15 రోజులుగా లోప్రెషర్‌తో మంచి నీటి సరఫరా అవుతుందన్నారు. దీంతో తాగేందుకు సైతం నీరు దొరకడం లేదంటూ విన్నవించారు. దీంతో ఆయన అధికారుల బృందాన్ని కాలనీకి పంపించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోప్రెషర్‌కు గల కారణాలను సిబ్బంది వివరించడంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నీటి సమస్యలు ఎక్కడ ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని జలమండలి అధికారులు కోరారు.

ఆర్టిజన్‌ల ముందస్తు అరెస్టు

రాజేంద్రనగర్: స్టాండింగ్ ఆర్డర్స్ రద్దు చేసి ఏపీఎస్‌ఈబీ విధానాన్ని వర్తింపజేయాలని ఆర్టిజన్‌లకు ప్రత్యేక పీఆర్‌సీని ప్రకటించాలని మంగళవారం నుంచి విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్‌లు సమ్మెకు దిగారు. ఉదయం రాజేంద్రనగర్, శివరాంపల్లి, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ముందు ఆందోళనకు దిగారు. మజ్లిస్ పార్టీ అనుకూల యూనియన్‌తో పాటు తెలంగాణ యూత్ ఎంప్లాయిస్ యూనియన్‌లు వీరికి మద్దతు పలికాయి. సమ్మె నేపథ్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులను ముందుజాగ్రత్తగా మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వీరిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు రాజు, సాజిత్, అనిల్‌కుమార్, అహ్మద్, సీతారామ్, చక్రపాణి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: చెరువులో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ సమాచారం మేరకు... మండలంలోని చౌదరిగూడ శివారులో ఉన్న చెరువు ఒడ్డున ఓ బెడ్ షీట్‌లో మృతదేహం ఉన్నట్లు మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏసీపీ భాస్కర్, ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నీలి రంగు బెడ్‌షీట్‌లో వ్యక్తి మృతదేహం చుట్టి నీళ్లల్లో పారేశారు. మృతదేహం కుళ్లిపోవడంతో గుర్తించలేకపోయారు. మృతుడి ఒంటిపై నల్లరంగు ప్యాంటు, బూడిద రంగు షర్టు ఉన్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాణిక్యమ్మ కాలనీలో అధికారుల బృందం పర్యటన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ అంబేద్కర్ కాలనీ, మాణిక్యమ్మ కాలనీల్లో జీహెచ్ఎంసీ అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. నోడల్ అధికారి అనిల్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్, పారిశుధ్యం, విద్యుత్, జలమండలి, ఎంటమాలజీ, వైద్య, ఆరోగ్య శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పర్యటనలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాణిక్యమ్మ కాలనీ బేకరీ పక్కన ఏర్పాటు చేసిన సెల్లార్ గుంత ఇబ్బందికరంగా మారిందని దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఫిర్యాదు చేశారు. లోప్రెషర్‌తో తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. అన్ని విభాగాల అధికారులు సంబంధిత సమస్యలను నమోదు చేసుకున్నారు. జీహెచ్ఎంసీ వంద రోజుల పథకంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుంది.

ఉద్యమంలా రాష్ట్రాభివృద్ధి

సందడిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

- పార్టీకి కార్యకర్తలే బలం.. ఎల్లప్పుడూ అండగా ఉంటాం
- రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం
- ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి. వేదికపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్వామిగౌడ్ తదితరులు

రాజేంద్రనగర్: తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని.. రాష్ట్ర సాధనకు చేసిన పోరాటాలే స్ఫూర్తిగా ప్రగతి ఉద్యమంలా సాగుతోందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన తెలంగాణను సీఎం కేసీఆర్ అహర్నిశలు కష్టపడుతూ రాష్ట్ర స్వరూపాన్ని మార్చారని వారు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ దుర్గానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి అంశాలు, సామాజిక భద్రతపై తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డ పుడితే భారం అనుకున్న వారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో వివాహాలు చేసి ఘనంగా అత్తారింటికి పంపుతున్నారన్నారు. ప్రభుత్వం దవాఖానాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని వెల్లడించారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా ధారపోసేందుకు సిద్ధమయ్యారని, ఆయన పోరాటం ఫలితంగానే రాష్ట్ర ఏర్పడిందని వారు గుర్తుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు కోసం సాగిన పోరాటంతో స్వరాష్ట్రంలో దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దూసుకుపోతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి 60 లక్షల సభ్యత్వాలు ఉన్నాయన్నారు.



సభకు హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

ఎనిమిదేళ్లలో ఎంతో అభివృద్ధి: ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, పింఛన్లు అందిస్తూ ఆసరా కల్పించి భరోసా ఇస్తుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 60 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి గడిచిన ఎనిమిదేళ్లలో జరిగిందన్నారు. ప్రత్యేక కార్యచరణతో తాగునీటి సమస్యను దూరం చేసి ప్రతి ఇంటికీ అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. పార్టీకి కార్యకర్తలే బలమని పేర్కొన్నారు. వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



నార్సింగి మున్సిపల్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

మణికొండ: ప్రస్తుతం కొందరికి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి ప్రాణాలను కోల్పోతున్నారని, అలాంటి వారిని సీపీఆర్ విదానం ద్వారా బతికించవచ్చని, ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేసే విధానాన్ని తెలుసుకోవాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖ యాదగిరి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది, స్వీపర్లు, శానిటైజింగ్ సూపర్‌వైజర్లకు నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ పద్మ సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అకస్మాత్తుగా కింద పడిపోయిన వారి గుండెపై రెండు చేతులు పెట్టి నొక్కటం, నోటి ద్వారా శ్వాసను సకాలంలో అందించటంతో వారిని బతికించవచ్చన్నారు. అలా చేసిన తరువాత వారిని వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రమాదం నుంచి బయట పడతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ వి. సత్యబాబు, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, పత్తి ప్రవీణ్ కుమార్, శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాంల, సిబ్బంది పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మనం తీసుకునే ఆహారంలో సమతుల్యత లేనందున పలు కంటి సమస్యలు వస్తున్నాయని, వాటిని సకాలంలో గుర్తించి కంటి చూపును సమస్యలను నివారించుకునేందుకు వార్డుల వారీగా ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన 12వ వార్డు డైమండ్ హిల్స్‌లో కంటి వెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ ఎస్. శ్వేతకిరణ్‌కుమార్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎక్కువ మంది కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్న పిల్లలకు సైతం కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ఆయా సమస్యల నివారణకు పరీక్షలు నిర్వహించుకుని డాక్టర్‌లు సూచించే ఆహారం, మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డి.పురుషోత్తం, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు బి.ముత్యాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటికీ సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు

బండ్లగూడ: దేశంలో మతోన్మాదాన్ని పెంచుతూ మనువాద భావజాలాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చుతున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు ప్రజలను కోరారు. మోదీ హటావో దేశ్‌కు బచావో ఇంటింటి కార్యక్రమాన్ని గండిపేట మండల పరిధిలోని ఆరెమైసమ్మ చౌరస్తాలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత భారత పారిశ్రామిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని... రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనువాదాన్ని అమలు చేసే కుట్రలు పన్నుతున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.కిషోర్, నియోజకవర్గ కో కన్వీనర్ జయపాల్‌రెడ్డి, మండల కార్యదర్శి బాబురావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, అంజి, స్వామి, కార్యాలయ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈటలను విమర్శించే నైతికహక్కు కాంగ్రెస్‌కు లేదు

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్



మాట్లాడుతున్న బైతి శ్రీధర్ తదితరులు

శంషాబాద్: బీజేపీ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను విమర్శించే నైతిక హక్కు... స్థాయి కాంగ్రెస్ పార్టీ నేతలకు లేదని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని తొండుపల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌ను గట్టెక్కించేందుకు మాత్రమే కాంగ్రెస్ తంటాలు పడుతోందన్నారు. కాంగ్రెస్ పడే ప్రతి ఓటు బీఆర్ఎస్ లబ్ధి చేకూర్చేందుకే ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఈటలపై విమర్శలు చేసి హాలోలయ్యేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయింది వాస్తవం కాదా అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా ప్రశ్నించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కమల వికాసం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు.

బండి సంజయ్‌కి ఘన స్వాగతం



బండి సంజయ్‌కు స్వాగతం పలికిన బీజేపీ నేతలు

శంషాబాద్: మహబూబ్‌నగర్ మిలియన్ మార్చ్ కార్యక్రమానికి బయలుదేరిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తొండుపల్లిలో పార్టీ నేతలు ఏర్పాటు చేసిన సమావేశం వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందికిశోర్, బీజైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, చంద్రయ్య, భాస్కర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీను, జ్ఞానేశ్వర్ తదితరులు ఆయనకు గనంగా స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి విస్తృతంగ కృషి చేయాలని బండి సంజయ్ వారికి సూచించారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్

శంషాబాద్: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కొత్వాల్‌గూడలో కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్ కలిసి ఆయన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం కల్పించిన చక్కని అవకాశం కంటి వెలుగు కార్యక్రమమని అన్నారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను సహించం

మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణకుమార్



అక్రమనిర్మాణాలను కూల్చివేయిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి రాకేష్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల వరకే నిర్మాణాలను చేపట్టాలని, దాని కంటే అదనంగా నిర్మిస్తే వాటిని కూల్చివేయటంతో పాటు బిల్డర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో రోడ్డు నెంబర్ 10, రోడ్డు నెంబర్ 8, స్పోర్ట్ పార్క్ పక్కన తాము తీసుకున్న అనుమతల కన్నా ఒక్కో అంతస్తు పెంచి నిర్మిస్తుండటంతో వాటిపై టౌన్‌ప్లానింగ్ అధికారి రాకేష్ ఆధ్వర్యంలో కొరడా జులిపించారు. అదనంగా నిర్మించిన అంతస్తుల స్లాబ్‌లు, గోడలను కూల్చివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... ఓ సారి కూల్చిన తరువాత తిరిగి నిర్మాణం చేపడితే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామన్నారు. అదనంగా నిర్మించిన అంతస్తుల రిజిస్ట్రేషన్‌లు జరగకపోవటం, విద్యుత్, నీటి కనెక్షన్‌లు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేరాల నియంత్రణకు చొరవ చూపాలి



చౌదరిగూడలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్

శంషాబాద్ రూరల్: నేరాల నియంత్రణలో గ్రామస్తులు చొరవ తీసుకోవాలని శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని చౌదరిగూడలో నేరాల నియంత్రణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు, కొత్త వ్యక్తుల సంచారంపై గ్రామస్తులు నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా, ఇతర వివరాలను అపరిచితులకు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్ కుమార్, నాయకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు సమష్టిగా పోరాడాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

మణికొండ: మలేరియా మహమ్మారిని భూస్థాపితం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నార్సింగిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో మలేరియా వచ్చే విధానాలు, అది రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... మన ఇంటి పరిసరాలలో ఎట్టి పరిస్థితిలో ఎందులోనూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆ నీరే దోమలు గుడ్లు పెట్టేందుకు స్థావరంగా మారుతుందన్నారు. మన ఇంటి పరసరాల్లో దోమలు లేకుండా చేసినపుడే మలేరియాను నిర్మూలించగలమన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాకేష్, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృపావరం, విద్యార్థినులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి

మార్కెట్‌లోకి సరికొత్త మహీంద్రా బొలెరో

రాయదుర్గం: మహీంద్రా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ పిక్–అప్ వాహనాన్ని హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌నక్రా మాట్లాడుతూ సరికొత్త బొలెరో ఎంఎక్స్‌ఎక్స్ శ్రేణి అత్యాధునిక ఫీచర్లు, సాటిలేని శక్తి, అధిక మైలేజీని అందిస్తుందన్నారు ఎంఅండ్ఎం ఆటోమోటివ్ టెక్నాలజీ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఆర్ వేలుసామి మాట్లాడుతూ ఎంఎక్స్ఎక్స్ శ్రేణి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపర్చడానికి ఉత్పాదకతను పెంచడానికి ప్రతి ఫీచర్ నిశితంగా రూపొందించబడిందన్నారు. కార్యక్రమంలో మహీంద్రాగ్రూపు జోనల్ హెడ్ అనురాగాన్స్‌రాయ్, ప్రతినిధులు పాల్గొన్నారు.



గౌలిదొడ్డిలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి



బండ్లగూడలో మేయర్ మహేందర్‌గౌడ్...

సందడిగా బీఆర్ఎస్ జెండా పండగ



రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా పండగను మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జెండాలను ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్, రాపోలు సత్తయ్య, రగడంపల్లి శ్రావణ్, మైలార్‌దేవ్‌పల్లిలో సయ్యద్ అతాహుల్లా, రఘుయాదవ్, ప్రేమ్‌గౌడ్, సరికొండ వెంకటేష్ తదితరులు జెండా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో...

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల వార్డుల వారీగా ఉత్సాహంగా నాయకులు, పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాలను ఎగరవేశారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి గ్రామాల పరిధిలోని వార్డులలో నాయకులు జెండాలను ఆవిష్కరించి పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఆర్.నర్సింహాలు వార్డుల వారీగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపల్ చైర్మన్ డి. రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ జెండా వందన కార్యక్రమాలు జోరుగా సాగాయి. కార్పొరేషన్ 7వ డివిజన్‌లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్పొరేటర్లు పద్మావతిపాపయ్యయాదవ్, సాగర్‌గౌడ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, నాయకులు సుమన్‌గౌడ్, రాజిరెడ్డి, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీరాములు



నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహా